క్లుప్తంగా

తహసీల్ కార్యాలయం తనిఖీ



నస్రుల్లాబాద్(బాన్సువాడ): స్థానిక తహసీల్ కార్యాలయాన్ని ఆర్డీవో భుజంగరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సమయ పాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లి ఊరచెరువు నుంచి బెజుగంచెరువుతండా వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనుల్లో భాగంగా నిర్మిస్తున్న కల్వర్టు పనులను మంగళవారం స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి పరిశీలించారు. కల్వర్టు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. జలాల్‌పూర్, జప్తిజాన్కంపల్లి మాజీ సర్పంచ్‌లు క్రిష్ణ, సాయిలు ఉన్నారు.

రుద్రారంలో సోషల్ అడిట్



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రుద్రారం గ్రామంలో మంగళవారం జీపీ కార్యాలయంలో ఈజీఎస్ పనులకు సంబంధించిన సోషల్ అడిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోషల్ అడిట్ అధికారులు గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబందించిన నివేదికలను గ్రామస్తులకు వినిపించారు. ఉపాధి పనులకు సంబంధించి కొన్ని ఎంబీ రికార్డులు చేయకపోవడం, కొంత మంది కూలీలకు డబ్బులు అందించని విషయంపై అభ్యంతరం తెలిపారు. గ్రామ ప్రత్యేక అధికారి గిరిధర్, ఎంపీపీ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ డీఎస్పీగా నేడు బాధ్యతల స్వీకరణ



బాన్సువాడ: బాన్సువాడ డీఎస్పీగా సత్యనారాయణ బదిలీపై వచ్చారు. హైదరాబాద్‌లోని ఇంటలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వహించిన సత్యనారాయణ బాన్సువాడకు బదిలీ అయ్యారు. బాన్సువాడలో పని చేసిన జగన్నాథ్‌రెడ్డి ఏసీబీ డీఎస్పీగా హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. నేడు బాన్సువాడలో డీఎస్పీ బాధ్యతలు చేపట్టనున్నారు.

టోల్‌ప్లాజా యూనియన్ అధ్యక్షుడిగా నర్సాగౌడ్



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా సిబ్బంది తమ యునియన్ అధ్యక్షుడిగా కాసాల నర్సాగౌడ్‌ను ఎన్నుకున్నారు. మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో నర్సాగౌడ్‌కు 42 ఓట్లు రాగా, కర్రోళ్ల పెంటగౌడ్‌కు 18 ఓట్లు, పుల్లూరి అంజికి 15 ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారులు కాసాల నర్సాగౌడ్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని నర్సాగౌడ్ అన్నారు.

ప్రమాద స్థలి పరిశీలన



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పోచారం చౌరస్తా 161 జాతీయ ప్రధాన రహదారిపై ఐదు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని మంగళవారం సీఐ నరేష్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాణి, ఎస్సై కోనా రెడ్డి, హైవే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీపీల ఖాతాలు ఖాళీ..!

- నిధుల్లేక నిస్తేజంగా మారిన గ్రామాలు
- పారిశుధ్య కార్మికులకు వేతనాలు కరువు



పోచారంలో మురికి కాలువలో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామ పంచాయతీల ఖాతాలు నిధుల్లేక ఖాళీ అయ్యాయి. సర్పంచుల పదవీ కాలం పూర్తవడంతో గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. దీంతోపాటు ప్రత్యేకాధికారులకు చేతినిండా పని అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవల గ్రామాలలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. కాని పంచాయతీల ఖాతాల్లో నిధులు జమ కాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవలే పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచ్‌లకు గ్రామ పంచాయతీల ద్వారా బిల్లులు బకాయి ఉన్నాయి. ప్రస్తుతం జీపీలకు మంజూరయ్యే నిధులతోనే గ్రామాలలో పాలన కొనసాగించాలని, తమ ఆదేశాలు వచ్చాకే బకాయి బిల్లులు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది.

వేసవి సమస్య గట్టెక్కేనా..?

గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జీపీల ద్వారా చర్యలు చేపట్టాల్సి ఉంది. క్రమక్రమంగా పెరుగుతున్న ఎండల తీవ్రత కారణంగా బోర్లు ఎండిపోవడంతోపాటు తరుచూ మోటార్లు కాలిపోతున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సి ఉంది. కాని ప్రస్తుతం జీపీల ఖాతాల్లో నిధులు లేక ఖాళీగా ఉండడంతో ప్రత్యేకాధికారులతోపాటు పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. దీనికి తోడు కార్మికులకు సైతం రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడంతో కొన్నిచోట్ల పారిశుధ్య కార్మికులు విధుల్లోకి రావడం లేదు. ప్రభుత్వం స్పందించి జీపీల ఖాతాల్లో నిధులను జమచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫిర్యాదుల పెట్టెలతో సమస్యలకు చెక్



జంగంపల్లిలో ఫిర్యాదుల పెట్టెను ప్రారంభిస్తున్న బీజేపీ నేతలు

భిక్కనూరు: ఫిర్యాదుల పెట్టెలతో సమస్యలకు చెక్ పెట్టవచ్చని బీజేపీ మహిళా మోర్చ అసెంబ్లీ కన్వీనర్ పావని అన్నారు. జంగంపల్లిలో ఎమ్మెల్యే కేవీఆర్ ప్రవేశపెట్టిన ఫిర్యాదుల పెట్టెను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కేవీఆర్ ప్రజల సమస్యలను పరిష్కరింపజేసేందుకు దేశంలో మొదటిసారిగా ఫిర్యాదుల పెట్టెను ప్రారంభించాడన్నారు. బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు అత్తెల్లి తిరుమలేష్, నేతలు ప్రసాద్, నరేందర్, తదతరులు పాల్గొన్నారు.

కామారెడ్డి అర్బన్: సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి ఏర్పాటు చేసిన ఫిర్యాదులు, సలహాల పెట్టెను మంగళవారం సాయంత్రం కామారెడ్డి పట్టణం దేవునిపల్లి ఊరడమ్మ ఆలయం వద్ద ప్రారంభించారు. నియోజకవర్గంలోని ప్రజలెవరైనా ఈ పెట్టెలో తమ ఫిర్యాదులు, సలహాలు రాసి వేయవచ్చని బీజేపీ ఫ్లోర్ లీడర్‌శ్రీకాంత్ అన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు విపుల్‌జైన్, బీజేపీ వార్డు ఇంచార్జిలు కాసర్ల రాజలింగం, చిన్నొల్ల రజనీకాంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

బాన్సువాడ రూరల్: గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బోర్లంక్యాంపు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో విద్యార్థుల మెస్ చార్జీలు పెంచుతామని ప్రకటించిన ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకోలేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని కోరారు. ప్రతి గురుకుల పాఠశాలకు ఒక డిప్యూటీ వార్డెన్, కళాశాలల్లో ఏవో పోస్టులు మంజూరు చేయాలని, అకారణ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలని వినతి



నినాదాలు చేస్తున్న జిల్లా జేఏసీ నాయకులు

కామారెడ్డి అర్బన్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికుల బతుకులు బజారున పడ్డాయని ఆటో డ్రైవర్స్ యూనియన్ ఐక్యకార్యచరణ కమిటీ(జేఏసీ) జిల్లా అధ్యక్షుడు బోదాసు నర్సింలు అన్నారు. మంగళవారం జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రగతిభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నామన్నారు. నాయకులు నర్సింలు, జి.రాజయ్య, ఆర్.కృష్ణ, భూషణ్‌గౌడ్, స్వామిగౌడ్, మారుతి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శరత్ చంద్ర

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డైరీ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వారం రోజులుగా తాడ్వాయి మండలంలోని సంతాయిపేట్‌లో క్లీన్-గ్రీన్ అనే కార్యాక్రమాలు చేసి తమ సేవ దృక్పథాన్ని చాటుకున్నారని కళాశాల ప్రిన్స్‌పల్ శరత్ చంద్ర అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కళాశాలకు చెందిన 40మంది వలంటీర్‌లు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు కాలనీలో తిరుగుతూ పలు సేవా కార్యాక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. యోగా వల్ల కలిగే లాభాలు, పారిశుధ్యం విషయంలో జాగ్రత్తలు, మూఢ నమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఉమాపతి, రవీందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి వివరాలు సమర్పించాలి



రామారెడ్డి (ఎల్లారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంట్ కోసం పూర్తి వివరాలు సమర్పించాలని విద్యుత్ శాఖ ఏఈ బోయిని నరసింహ సూచించారు. ఈ నెల 15లోపు విద్యుత్ శాఖ అధికారులకు గాని ఇంటింటికి వచ్చే విద్యుత్ శాఖ సిబ్బందికి గాని ఇవ్వాలని కోరారు. గృహ జ్యోతి పథకం కోసం ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, కరెంట్ బిల్లు, ఫోన్ నెంబర్ వివరాలను సమర్పించాలని సూచించారు.

15న విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలి

కామారెడ్డి టౌన్: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఈనెల 15న జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు దినంగా ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో రాజుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు బాదావత్ ప్రవీణ్ నాయక్, గాంధారి మండల ప్రధాన కార్యదర్శి లకావత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు సుభాస్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ ముందు పెట్రోలింగ్ నిర్వహించాలి



కామారెడ్డి టౌన్: పట్టణంలోని జాతీయ రహదారి పక్కన గల ఎస్సీ బాలికల హాస్టల్ ఏరియాలో రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని షీ టీం ఎస్సై స్రవంతిని ఏబీవీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రాత్రి సమయంలో కొందరు ఆకతాయిలు బైక్‌లపై చక్కర్లు కొడుతూ బాలికలను ఇబ్బందులను గురిచేస్తున్నారని తెలిపారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, నాయకులు రోహిత్ తదితరులున్నారు.

పెంచిన వేతనాన్ని చెల్లించాలి



కామారెడ్డి టౌన్: మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రూ.వెయ్యిని వేతనాల్లో కలిపి చెల్లించాలని మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళవారం కమిషనర్ దేవేందర్‌ను కోరారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కౌన్సిల్‌లో చర్చించి పెంచిన వేతనాన్ని ఇవ్వాలని కోరారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజనర్సు తదితరులున్నారు.

రామేశ్వర్‌పల్లి వీడీసీ నూతన కార్యవర్గం



భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మద్ది సూర్యకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఏలేటి రమేష్‌రెడ్డి, చేపూరి రమేష్, ప్రధాన కార్యదర్శి నాగర్తి భూంరెడ్డి, కోశాధికారిగా తక్కళ్ల శ్యాంరెడ్డిలు ఎన్నికయ్యారు. సూర్యకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సూర్యకాంత్‌రెడ్డిని డీసీసీబీ మాజీచైర్మన్ ఎడ్ల రాజిరెడ్డితో పాటు పలువురు గ్రామస్తులు సన్మానించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



లింగంపేట(ఎల్లారెడ్డి): సేవాలాల్ జయంతి రోజును సెలవుదినంగా ప్రకటించినందుకు లింగంపేట మండల కేంద్రం అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్రపటాలకు గిరిజనులు పాలాభిషేకం చేశారు. కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ పరుశురాం, గిరిజన నేతలు దశరథ్, మేఘ్యానాయక్, ఫతియోద్దిన్, గన్నునాయక్, శివరాం పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో సైనికుల్లా పని చేయాలి

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తి గోపి



సమావేశమైన కాంగ్రెస్ కార్యకర్తలు

నస్రుల్లాబాద్/ఎల్లారెడ్డి: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తి గోపి అన్నారు. మంగళవారం నస్రుల్లాబాద్, ఎల్లారెడ్డి మండల కేంద్రాల్లో యూత్‌కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జహీరాబాద్ పార్లమెంటు స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునే విధంగా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పని చేయాలన్నారు. దీని కారణంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రతాప్ రెడ్డి, శివ రాథోడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు భాస్కర్‌గౌడ్, దొంతురాం కాశీరాం, కృష్ణా రెడ్డి, మహేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'ఏనుగు' మెప్పు కోసం కాంగ్రెస్ నేతల ఆరాటం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడ: మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి మెప్పు కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరాటపడుతున్నారని జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబంపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోచారం కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నాయకులు కృష్ణారెడ్డి, పిట్ల శ్రీధర్, ఎజాస్, మోహన్ నాయక్, పాత బాలకృష్ణ, తదితరులున్నారు.

వంద పడకల ఆస్పత్రిగా మార్చండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దోమకొండ: దోమకొండ ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి వినతిపత్రం అందజేసినట్లు జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ తెలిపారు. ఈ విషయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి ఆస్పత్రి స్థాయి పెంచేలా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బీబీపేట మండల అధ్యక్షుడు సుతారి రమేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సలీం, పార్టీ మండల సీనియర్ నాయకులు రామస్వామిగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ మధుసూదన్ తదితరులు ఉన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో విద్యార్థుల ప్రతిభ



శరత్ చంద్ర



సందీశ్వర్ రెడ్డి



వైష్ణవ్ చంద్ర

కామారెడ్డి టౌన్: జేఈఈ మెయిన్స్ ఫలితాలను మంగళవారం ప్రకటించగా జిల్లా కేంద్రంలోని సాందీపని కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. శరత్ చంద్ర 98.6, సందీశ్వర్ రెడ్డి 96.6, వైష్ణవ్ చంద్ర 94.08 శాతం మార్కులు సాధించారు. మరో 12 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించినట్లు కళాశాల డైరెక్టర్ బాలాజీరావు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక



సంజన



వైష్ణవి

మాచారెడ్డి: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు అక్కాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం మంజుశ్రీ తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ అవార్డుల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు సంజన, వైష్ణవిలు ప్రదర్శించిన రెండు ప్రయోగాలు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని హెచ్ఎం అన్నారు. జిల్లా నుంచి మొత్తం ఎనిమిది రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా అందులో రెండు అక్కాపూర్ పాఠశాలకు రావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గైడ్ టీచర్ సీహెచ్ సుస్మిత హెచ్ఎం మంజుశ్రీలను గ్రామ పెద్దలు, ఎంపీటీసీ బట్టు లత, మాజీ సర్పంచ్ మమత అభినందించారు.

ఆంగ్ల నాటికల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో డీఈవో రాజు, ఉపాధ్యాయులు, అధికారులు

కామారెడ్డి అర్బన్: ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో మంగళవారం కామారెడ్డి కళాభారతి ఆడిటోరియంలో జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఆంగ్లభాషలో నాటికలు, ఏక పాత్రాభినయం, ఆంగ్ల భాష నైపుణ్యం, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డీఈవో ఎస్.రాజు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో ఎల్లయ్య, సెక్టోరియల్ అధికారులు వేణుశర్మ, ఉమారాణి, తదితరులున్నారు.

సల్లంగ చూడమ్మ ఎల్లమ్మ తల్లీ..!



జిల్లా కేంద్రంలో బోనాల ఊరేగింపు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని రేణుకామాత, ఎల్లమ ఆలయ 27వ వార్షికోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున బోనాల ఊరేగింపు నిర్వహించారు. గౌడ కులస్తులు ప్రతి ఇంటి నుంచి బోనమెత్తుకుని పుర వీధుల గుండా ఊరేగింపుగా వచ్చి సిరిసిల్లా రోడ్‌లోని ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. అభిషేక పూజలు చేశారు.

రామేశ్వర్‌పల్లిలో ..

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లమ్మకు బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు నారాగౌడ్, రామాగౌడ్, రమేష్‌గౌడ్, మోతె శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పెద్దఏడ్గిలో శత యజ్ఞం



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని పెద్దఏడ్గి గ్రామంలో మంగళవారం స్వామి దయానంద సరస్వతి 200 జయంతి సందర్భంగా శత యజ్ఞం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దయానంద సరస్వతిస్వామి, సఫల ఆర్గనైజేషన్ సీఈవో, ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

దోమకొండ: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో మంగళవారం సాయిబాబా ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలకంరించిన వాహనంలో బాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు కన్న దామోదర్, బల్ల ఆనంద్, గుడ్ల విజయ్, సబ్బని ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాసర ఆలయానికి హుండీల అందజేత

రాజంపేట: బాసర జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి ఒడి బియ్యం హుండీలను మంగళవారం కామారెడ్డి జిల్లా అర్గొండ గ్రామానికి చెందిన కందాడి నరేందర్ రెడ్డి, కీర్తి శేషులు కందాడి జగ్గమ్మ జ్ఞాపకార్థం అందజేశారు. వీరి వెంట మమ్మయి సచిన్ ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మురికి కాల్వ పనులు ప్రారంభం

లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిసంగారెడ్డి 8వ వార్డులో కమ్మరి వెంకటేశం ప్లాట్ నుంచి వడ్ల అంజనేయులు ఇంటి వరకు మురికి కాల్వ పనులు మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ అనిల్‌రెడ్డి, మోహిద్, తదితరులున్నారు.

డివైడర్‌ను మూసివేయాలని వినతి

భిక్కనూరు: రామాయంపేట వైపు నుంచి భిక్కనూరు మండల కేంద్రంలోనికి వచ్చే దిశలో ఉన్న రోడ్డు డివైడర్‌ను మూసివేయాలని భిక్కనూరు శ్రీరామదండు ప్రతినిధులు మంగళవారం భిక్కనూరు పంచాయతీ కార్యాలయంతో పాటు తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ సీఐ, ఎస్సైలకు వినతి పత్రాలను అందజేశారు. ఈ డివైడర్ వద్ద కొన్నేళ్లుగా చాలా ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని,అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అల్పాహారం అందజేత

బీబీపేట: మాందాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు నెల రోజుల పాటు గ్రామానికి చెందిన అంకన్నగారి నాగరాజు గౌడ్ అల్పాహారం అందజేయడానికి ముందుకువచ్చారు. తన సొంత ఖర్చుతో 42 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతుల్లో అల్పాహారం అందజేయడంతో పాటు విద్యార్థులకు పరీక్షల పట్ల పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు కష్టపడి చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, వహీద్, పవన్, కృష్ణ, విజయానంద్, సులోచన, బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూదన్ : 9951027699
ఎల్లారెడ్డి: డి. యల్. ఎన్. గౌడ్ : 6300453108
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899